


ప్రారంభమైన శబరిమాత ఆలయ వార్షికోత్సవం

బోథ్, మార్చి 19 : మండలంలోని కౌటా(బి) గ్రామంలో శబరిమాత ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు గ్రామంలోని గ్రామ దేవతలన్నింటికీ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు శివానంద భారతీ స్వామి చేతుల మీదుగా ధ్వజారోహరణ చేపట్టారు. అనంతరం ఆలయంలో హోమ గుండాన్ని నిర్వహించగా భక్తులు ప్రత్యేక పూజలుచేపట్టారు. వేదపండితులు పండరీశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



సోయం.. నారాజ్!

ఆదిలాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ ఉద్యమ నేత.. సిట్టింగ్ ఎంపీ సోయంబాపూరావు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. టికెట్ కోసం చివరి వరకూ ప్రయత్నాలు చేసినా.. దక్కక పోవడంతో పార్టీకి అంటీ ముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థి ప్రచారాన్ని ప్రారంభించినా.. ఆయన మాత్రం దూరంగానే ఉంటున్నారు. ప్రధాని మోదీ జిల్లా పర్యటన తర్వాత డిల్లీకి వెళ్లిన సోయం తిరిగి జిల్లాకు రాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సిట్టింగ్ ఎంపీలందరికీ మళ్లీ అవకాశం కల్పించిన బీజేపీ సోయం బాపూరావును మాత్రమే పక్కన పెట్టడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆయన పార్టీలో కొనసాగుతారా లేదా అనేది ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని విధంగా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన సోయం ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు.ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీగా పుంజుకుంది.అయితే సిట్టింగ్‌ను కాదని వలస నేతకు అవకాశం ఇవ్వడంపై సోయం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ టికెట్ దక్కక పోవడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం సోయం పార్టీలోనే కొనసాగుతున్నా పార్టీ అభ్యర్థికి మద్దతునివ్వడం అనుమానంగానే కనిపిస్తోంది.దీంతో బీజేపీ గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.టికెట్ దక్కక పోవడంతో ఆయన అనుచరవర్గం అయోమయానికి గురవుతోంది.ఇక ఆయన రాజకీయ భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉంటుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

లంబాడా వ్యతిరేకిగా ముద్ర..

ఆరేడు ఏళ్ల క్రితం ఆదివాసీ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రగిలించిన సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుపై బీజేపీ లంబాడా వ్యతిరేకిగా ముద్రవేసి పక్కన పెట్టిందన్న ప్రచారం సాగుతోంది.సోయం బాపూరావు ఎంపీగా గెలిచిన తర్వాత పార్లమెంట్ సమావేశాల్లోనూ ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని పలుమార్లు ప్రసంగించారు.అలాగే న్యాయ పోరాటం చేస్తూ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు.గత కొన్నేళ్లుగా ఆదివాసీ, లంబాడాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ సిట్టింగ్ ఎంపీ సోయంకు టికెట్ ఇస్తే లంబాడా సామాజిక వర్గం దూరమవుతుందన్న ఉద్దేశంతోనే పార్టీ అధిష్ఠానం పక్కన పెట్టినట్లు తెలిసింది. ఎంపీగా గెలిచిన తర్వాత కూడా ఒకే సామాజిక వర్గానికి మద్దతుగా నిలవడం ఏమిటని అధిష్ఠానం పెద్దలు ప్రశ్నించినట్లు సమాచారం.అయితే గత ఎన్నికల సమయంలోనూ బాపూరావు ఆదివాసీ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. అయిన అప్పట్లో అభ్యంతరాలు చెప్పని పార్టీ ఈ సారి మాత్రం లంబాడా వ్యతిరేకి అన్న సాకుతో ఎన్నికలకు దూరం చేయడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ఆశావహుల సంఖ్య భారీగా పెరగడం, పార్టీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు కూడా అడ్డు వచ్చాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపుగా కాంగ్రెస్ పార్టీ కూడా సోయంపై ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది. మొత్తానికి ఆదివాసీ ఉద్యమంతో సోయం రాజకీయ భవిష్యత్తు ఇబ్బందుల్లో పడినట్లు కనిపిస్తోంది.

కనిపించని నేతల మద్దతు..

సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు పార్టీలో మద్దతు దక్కక పోవడంతోనే టికెట్ రాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ పరిధిలోని నియోజక వర్గాల్లో గెలుపొందిన నలుగురు ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా నిలువలేదు. పైపైన భాగానే కనిపించిన అంతర్గతంగా మాత్రం సోయంకు వ్యతిరేకంగా అధిష్ఠానం వద్ద ఎమ్మెల్యేలు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా ముఖ్యనేతలెవరూ సోయం వెంట లేక పోవడం కూడా కొంత ఇబ్బందికరంగానే మారిందని చెప్పవచ్చు. గతంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని సోయం బహిరంగంగానే ఆరోపించారు. అలాగే ఎంపీ ల్యాండ్ నిధుల విషయంలోనూ ఆయన వ్యాఖ్యలు వివాదాస్పందంగా మారాయి. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జీలు కూడా ఆయనకు మద్దతు తెలుపక పోవడంతో పార్టీ అధిష్ఠానం ప్రత్యామ్నాయంగా కొత్త అభ్యర్థిని బరిలోకి దింపిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమి పాలవడం టికెట్ రాక పోవడానికి ఓ కారణంగానే చెబుతున్నారు. ఇలాంటి పరిణామాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన ఆయన వ్యతిరేకవర్గం టికెట్ రాకుండా అడ్డుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అప్రమత్తమైన అగ్రనేతలు..

సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు పార్టీకి దూరమైతే ఆదివాసీల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఆ పార్టీ అగ్రనేతలు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా సైలెంటైన సోయంను బుజ్జగించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. పార్టీ మళ్లీ అధికారంలోకి రాగానే కేంద్రంలో నామినెటెడ్ పదవిని కేటాయిస్తామని కూడా చెప్పినట్లు తెలుస్తోంది. ఉద్యమనేత కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా సోయంకు ఆదివాసీ నేతలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో పార్టీకి కొంత వరకు నష్టం జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కానీ సోయం బాపూరావుమాత్రం మరికొంత కాలం పాటు వేచిచూసే ధోరణితోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికల వరకు బీజేపీలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

- టికెట్ దక్కక పోవడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఎంపీ సోయం
- లంబాడాలు దూరమవుతారనే పక్కన పెట్టిన పార్టీ?
- ఎమ్మెల్యేల వ్యతిరేకత, అండగా నిలవని పార్టీ క్యాడర్!
- పార్టీ అగ్రనేతల బుజ్జగింపులు.. అయినా వీడని అలక
- అయోమయంలో అనుచరవర్గం.. ఎటూ తేల్చని సోయం

'అందరి జాతకాలు బయట పెడతా..'



పార్టీలో నాకు వ్యతిరేకంగా పని చేసిన నేతలందరి జాతకాలు త్వరలోనే బయట పెడతా. ఏ కారణం చేత నాకు పార్టీ టికెట్ ఇవ్వలేదో అర్థం కావడం లేదు. నాజాతి సంక్షేమం కోసం పని చేయడం తప్పెలా అవుతుంది. పదవులు ఉన్నా.. లేకున్నా ఆదివాసీల కోసమే నిరంతరం పని చేస్తా. గత ఎన్నికల సమయంలోనూ ఆదివాసీ ఉద్యమంలో చురుకుగా పని చేశా. అప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు ఎలా వస్తున్నాయి. నా ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు నేతలు పనిగట్టుకుని అధిష్ఠానానికి తప్పుడు సమాచారాన్ని అందించారు. బీజేపీలో ఇంకా ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేం. మరికొంత కాలం పాటు వేచిచూస్తాం. ఆ తర్వాత నా రాజకీయ భవిష్యత్ ఏమిటన్నది ప్రకటిస్తా.

- సోయం బాపూరావు, సిట్టింగ్ ఎంపీ

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి



రాజురాలో బోగ్‌బండార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, మార్చి19: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే వారి కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొంటాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని రాజుర, లింగట్ల, ఆరెపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగదంబాదేవి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గల ఆలయాల్లో ప్రతీనిత్యం పూజలు చేస్తే గ్రామాల్లో సుఖ శాంతులు నెలకొంటాయన్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్‌సజన్, సాబ్లెనానక్‌సింగ్, గులాబ్‌సింగ్, దేవేందర్‌రెడ్డి, రవీందర్, చందర్‌సింగ్ తదితరులున్నారు.

ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సంతోష్‌రెడ్డి

నేరడిగొండ, మార్చి 19: మండల స్థాయి అధికారులు పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఓటరు జాబితాలో సవరణను వేగవంతం చేయాలన్నారు. కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవన్నారు. పెద్ద మొత్తంలో నగదు తరలించరాదన్నారు. ఓటర్లను ప్రలోభ పరుచొద్దన్నారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ మహేశ్, ఎంఆర్‌ఐ నాగోరావ్, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, ఎంసీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రంలో కూలిన పైకప్పు

● విద్యార్థిని, ఇన్విజిలెటర్‌కు స్వల్ప గాయాలు



గాయపడ్డ విద్యార్థిని

జైనథ్, మార్చి19: మండలంలోని గిమ్మా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం పైకప్పు కూలి ఓ విద్యార్థినితోపాటు ఇన్విజిలెటర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. పరీక్షా కేంద్రంలో సుమారు 12.20 గంటల సమయంలో గది పైకప్పు కూలి కూన పెంకలు కిందపడ్డాయి. దీంతో పరీక్ష రాస్తున్న పిప్పర్‌వాడ అభ్యుదయ పాఠశాలకు చెందిన విద్యార్థిని అక్షయకు, ఇన్విజిలెటర్ కె.పురుషోత్తంకు తలపై స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని గిమ్మా పీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో శ్రీనివాస్, గిమ్మా సీఎస్ లస్మన్న సీహెచ్‌సీకి చేరుకొని డాక్టర్ సుచల, వైద్య సిబ్బందితో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థిని, ఇన్విజిలెటర్ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

సెక్టోరల్ అధికారులకు శిక్షణ

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి19: పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ పాల్గొన్నారు.అన్ని అంశాలలో క్షుణంగా అవగాహన కలిగి ఉండాలని సెక్టోరల్ అధికారులు ఈవీఎంలు వివిధ పోలింగ్‌స్టేషన్లకు సంబంధించిన పూర్తి పరి జ్ఞానాన్ని కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సెక్టోరల్ ఆఫీసర్ రి టర్నింగ్ అధికారులకు క్షేత్ర స్థాయిలో జరిగే ఎన్నికల ప్రక్రియను ఎన్నికల నియమ నిబంధనలు లోబడి పని చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలు ఏ విధంగా నిర్వహించారో అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా నిర్వహించాలని తెలిపారు. అన్ని అంశాలపై ట్రైనర్ లక్ష్మణ్ అవగాహన కల్పించారు.



మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం

● కలెక్టర్ రాజర్షి షా
● మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి19: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ప్రారంభించారు. ఎంసీఎంసీలో ఏర్పాటు చేసిన టీవీలను, సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు డీపీఆర్‌వో ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ఏర్పాటు ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, పత్రికల్లో ప్రచురించిన రాజకీయ ప్రకటనలు అభ్యర్థి ఎన్నికల వ్యయంలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. శాటిలైట్ చానల్‌లు, కేబుల్ నెట్ వర్క్‌లు, సోషల్ మీడియా, ఈ పేపర్‌లో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు, ఇతర ఆడియా - వీడియో విజుల్ మీడియాలతో సహా రాజకీయ ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్‌మహతో, జిల్లా పౌర సంబంధాల అధికారిని తిరుమల, ఈడీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

బజార్‌హత్నూర్, మార్చి19: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలకేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలో 215మంది విద్యార్థులకు గాను 214 మంది హాజరయ్యారని డీఈవో ప్రణీత కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు తాగు నీరు, ఓఆరెస్ ప్యాకెట్లు, ఇతరత్రా సౌకర్యాలు, నిరంతరం విద్యుత్ సరఫరాలలో ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతనే లోనికి పంపాలని, సెల్‌ఫోన్‌ను అనుమతించవద్దని ఆదేశాంచారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. అనంతరం బజార్‌హత్నూర్ పీహెచ్‌సీని పరిశీలించారు. వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శంకర్, ఎంఈవో శ్రీకాంత్, డాక్టర్ భీంరావు, శిల్ప తదితరులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ నేలకొరిగిన జొన్న పంట

అకాల.. బీభత్సం

- వడగళ్ల వర్షంతో వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



లఖింపూర్ ఎగిరిపడ్డ ఇళ్ల రేకులు

తలమడుగు, మార్చి19: రెండు రోజులపాటు కురిసిన ఈదుగాలులతోకూడిన వడగండ్ల వర్షానికి జిల్లా వందలాది ఎకారాల్లో వివిధ రకాల పంటలు ధ్వంసమయ్యాయి. తలమడుగు మండలం పల్లి(బి), పల్లి(కె), బరంపూర్ గ్రామంలో చేతికొచ్చిన దాదాపు 1500 ఎకరాల మొక్కజొన్న, పొగ ఆకు, జొన్న పంటలు నేల మట్టం అయ్యాయి. మంగళవారం తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఏవో మహేందర్ పంటను పరిశీలించారు. కలెక్టర్ రాజార్షిషాని కలిసి సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి : అనిల్‌జాదవ్

తలమడుగు, మార్చి19: రెండు రోజులుగా బోథ్ నియోజక వర్గంలో కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.50వేల ఆర్థిక సహాయం చెల్లించాలని కోరారు. మండలంలోని పల్లి(కె) బరంపూర్ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. అధికారుల స్పందించి పంటలు నష్ట పోయిన రైతులను సర్వే చేయించి పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. కాటుపల్లి వసంతరెడ్డి, కేదరేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్‌తోట వెంకటేశ్, ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి మాధురి రమాకాంత్, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.


బోథ్: సోమ, మంగళవారాలు కురిసిన అకాల వర్షాలకు అన్నదాత తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చే జొన్న, శనగ, గోధుమ, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం సంభవించింది. ఈదురు గాలులతో చేతికందే పంట నేలపాలయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం సోనాల గ్రామం సమీపంలో ఈదురు గాలుల బీభత్సంతో పంటలు నేలకొరిగాయని రైతులు వాపోతున్నారు.

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం పంటలకు భారీ నష్టాన్ని కలిగించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగండ్లతో భారీ వర్షం కురిసింది. రాళ్ల వర్షం వల్ల ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్న నువ్వు, పెసర, కూరగాయల పంటలు నేలకొరిగాయి. మండలంలో సుమారు 8 వేలపై చిలుకు ఎకరాలలో పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.



బోథ్ మండలంలో నేలవాలిన జొన్న పంట

సిరికొండ: మండలంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని గాలి దుమారం చెలరేగింది. గంటకుపైగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లఖంపూర్ గ్రామంలోని ఇళ్లపై రేకులు కొట్టుకుపోయాయి. మట్టి గోడలతో నిర్మించిన ఇళ్లు కూలిపోయాయి. వర్షంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వేల ఎకరాల్లో జొన్న పంట నేలమట్టమవడంతో రైతులు కొన్ని వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.



సిరికొండలో నేలకొరిగిన జొన్న పంట

బజార్‌హత్నూర్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వడగండ్ల వర్షానికి మొక్కజొన్న, జొన్న, నువ్వు, ఇతరత్రా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు నష్టపోయారు. పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉట్నూర్ : మండలంలోని జొన్న, మొక్కజొన్న పంటలకు ఈదురు గాలులు నష్టం తెచ్చిపెట్టాయి. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో షాంపూర్, పులిమడుగు, నాగపూర్, చందూరి, లక్కేటిపేట ప్రాంతాలలోని రైతులకు చెందిన జొన్న, మొక్కజొన్న పంట నేలకొరిగింది. 30 ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్‌శ్రీరామ్‌నాయక్,ఆయా ప్రాంతాలలోని పంటలను పరిశీలించారు.

జైనథ్ : మండలంలోని ఆయా గ్రామాలతో పాటు జైనథ్ లక్ష్మీపూర్ దీపాయిగూడ, ఆనంద్‌పూర్, కూర మేడిగూడ తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం అకాల వర్షం కురిసింది. ఈ వాన వడగళ్ల వాన కురియడంతో ఆయా గ్రామాల్లో రైతులు వేసిన జొన్న, నువ్వు, మొక్కజొన్న తదితర పంటలు ఈదురు గాలలతో నేలకొరిగాయి.



రైతులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పంటలను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



మాజీ ఎంపీటీసీని పరామర్శించిన ఐకే రెడ్డి



నిర్మల్ కల్చరల్, మార్చి 19 : బొప్పారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రామ్‌రెడ్డి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడు తుండగా.. మంగళవారం మాజీ మంత్రి ఇంద్ర కరణ్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు రాం కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహినుద్దీన్, జడ్పీటీసీ జీవన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ పరామర్శించిన వారిలో ఉన్నారు.



గీత కార్మికుల సమస్యలను ఈఎస్‌కు విన్నవించిన మోకుదెబ్బ నాయకులు



ఈఎస్‌ను సన్మానిస్తున్న మోకుదెబ్బ నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 19 : జిల్లాలోని గీత కార్మికుల, గౌడ కులస్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎంఏ రజాక్‌కు మోకుదెబ్బ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జాతీయ అధ్యక్షుడు తెలంగాణ జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జి. శ్రీనివాస్‌గౌడ్, కే. బాలాగౌడ్, ఎన్.గణేష్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఈఎస్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు మాజీ ఉప సర్పంచ్ రాజీనామా

నిర్మల్ కల్చరల్, మార్చి 19 : సోన్ మండలం కూచన్‌పెల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ లింగన్న బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

భగీరథ లీకేజీలతో నీటి వృథా



వృథాగా పోతున్న నీటిని చూపుతున్న గ్రామస్థుడు

కుభీర్, మార్చి 19 : మండల కేంద్రంలో పలు చోట్ల మిషన్‌భగీరథ పైపులైన్లకు లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో నీటిని సరఫరా చేసే సమయంలో వృథాగా రోడ్లపై పారుతున్నాయి. రహదారులు బురదమయంగా మారడంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ గాంధీచౌక్ నుంచి మజిత్‌కు వెళ్లే మార్గంలో లీకేజీ గుంతగా ఏర్పడింది. గుంతలో నీరు నిలవడంతో దోమలు వ్యాప్తి చెందడంతో పాటు నీరు కలుషితమై రోడ్డుపై వృథాగా పారుతున్నాయి. లీకేజీలకు మరమ్మతులు చేపట్టి నీరు కలుషితం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.















సమస్యలకు నిలయంగా ఇచ్చోడ!



ఇచ్చోడ అశోక్‌నగర్ కాలనీలో నిలిచిఉన్న మురుగునీరు



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు

ఇచ్చోడ, మార్చి19: పేరుకు మేజర్ గ్రామపంచాయతీ అయిన ఇచ్చోడలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడికక్కడ మురికి నీరు మడుగులు గడుతోంది. దీంతో దుర్వాస భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి డ్రైనేజీల్లో పూడిక తీయక పోవడంతో మురికి నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు జనం ఇక్కట్లు పడుతున్నారు. అశోక్‌నగర్, టీచర్స్ కాలనీలో కనీస పారిశుధ్య చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇచ్చోడ నుంచి అడేగామ(బి) గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మురుగునీరు నిల్వ ఉంటుంది. ఎంతో కాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కనే డ్రైనేజీ కంపును భరించలేక జనం ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాలువలు నిర్మించకపోవడంతో ఇంటి పక్కన పరిసరాల్లోనే పెద్దపెద్ద గుంతలు ఏర్పడి మురుగు నీటి గుంతలుగా మారాయి. దీంతో మురుగునీటిలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల బెడద తీవ్రతరమై కాలనీవాసుల రోగాల బారిన పడుతున్నామని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిని కాలనీవాసులు, ప్రజలు కోరుతున్నారు.



ఇచ్చోడ గ్రామపంచాయతీ కార్యాలయం

మాస్ కాపీయింగ్‌కు పాల్పడతే కఠిన చర్యలు

● జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ నారాయణ

జైనథ్, మార్చి19: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా పదో తరగతి ఫ్లాయింగ్ స్క్వాడ్ యూ.నారాయణ అన్నారు. మండలంలోని పెండల్‌వాడ, జైనథ్, గిమ్మా పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి గది తిరుగుతూ విద్యార్థులు రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్‌లు మహాలక్ష్మి, సూర్యకాంత్, ఎం.లస్మన్న, వీరేందర్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలెటర్లు ఉన్నారు.

కళాకారులకు సహకారం అందిస్తా : పాయల

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి 19: పట్టణ కళాకారుల్లో నైపుణ్యాలున్న అవకాశాలు లేక ముందుకు సాగలేక పోతున్నారని, వారికి తనవంతుగా పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. ఆర్‌ఎస్ 38 ర్యాపర్స్ ఆధ్వర్యంలో చిత్రీకరించిన ఆదిలాబాద్ డాన్‌షార్ట్ ఫిలింను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.మంగళవారం కళాకారులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి లఘు చిత్రాన్ని విడుదల చేయించారు.ఆదిలాబాద్ కళాకారుల్లో అనేక నైపుణ్యాలున్నాయని, సరైన ప్రోత్సాహం లేక ఇక్కడే ఆగిపోతున్నారని ఎమ్మెల్యే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత సినిమాటోగ్రాఫికి వీరిని పరిచయం చేసేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఆదిలాబాద్ కళాకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కార్యక్రమాలు చేపట్టేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో కళాకారులు గణేష్,దాసన్న,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖలో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

ఉట్నూర్, మార్చి19: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్న నలుగురు ఉద్యోగులను గిరిజన సంక్షేమ శాఖ అధికారి దిలీప్‌కుమార్ సస్పెండ్ చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సోమవారం తాంసి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన సమయంలో అక్కడి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వప్న అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడంతో ఐటీడీఏ పీవో ఆమెను సస్పెండ్ చేయాలని డీడీని ఆదేశించారు. ఈ మేరకు డీడీ దిలీప్‌కుమార్ మంగళవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కాకుండా తాంసి ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బంది విజయ్ మహేందర్‌లకు కూడా షోకాజ్ మెమోలు జారీ చేశారు. ఆదివారం నేరడిగొండ ఆశ్రమ పాఠశాలను డీడీ తనిఖీ చేసిన సమయంలో ఆదివారం టర్న్ డ్యూటీలో ఉండాల్సిన ఉపాధ్యాయుడు రాములు విధుల్లో లేక పోవడంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 28న మామిడిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందిన సంఘటనలో ప్రధానోపాధ్యాయుడు అశోక్ నిర్లక్ష్యాన్ని గుర్తించిన అధికారులు సస్పెన్షన్ చేశారు. అదే విధంగా కుంటాల స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, ఎస్సీఈఆర్సీ లా నివేదిక మేరకు కుంటాల పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్‌రామ్ విధులకు హాజరుకాకుండా అతని స్థానంలో మరో వ్యక్తిని నియమించి విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతో వెంకట్‌రాంను సస్పెండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన భోజనంతో పాటు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తలమడుగు,మార్చి19: అప్పులతో బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లాతో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలమడుగు మండలం బరంపూర్ గ్రామానికి చెందిన కాకెర్ల ఆశన్న(43) అనే రైతు తనకున్న రెండు ఎకరాల 19 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడాది కాలంగా ఏ పంట వేసినా దిగుబడి రాకపోగా పంట నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయం కోసం చేసిన అప్పులు అధికం కావడంతో ఆ అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందాడు. మంగళవారం ఉదయం చేను పంటకు నీరుపెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆశన్న పొలం గట్టుపై అపస్మారక స్థితిలో పడిఉండడం గమనించిన గ్రామస్థులు కుటుంబీకులకు సమాచారం అందజేశారు. కుటుంబీకులు పొలానికి వెళ్లగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఆశన్నకు బ్యాంకులో, ఇతర ప్రైవేటు అప్పులు దాదాపు రూ.5లక్షల వరకు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య సుచరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆశన్నకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

● రూ.4330 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి19: పట్టణంలో రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కుర్షిద్‌నగర్ ఏరియాలో మట్కా స్థావరంపై దాడ చేసనట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా నిందితుడు అబ్దుల్ సలాం, అతడి తండ్రి ఎస్‌కే అహమ్మద్ మట్కా నిర్వహిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. వారి వద్ద నుంచి మట్కా చిట్టీలు, రూ.4330 నగదు స్వాధీనం చేసుకుని ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మట్కా, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ 8712659965కు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండల

కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక

లక్ష్మణచాంద, మార్చి 19 : కాంగ్రెస్ పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వివిధ గ్రామాలకు చెందిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. నూతన ఎన్నిక ప్రకారం ఉపాధ్యక్షులుగా గంగాధర్ గౌడ్, కే. పోతారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి. మల్లేశ్వర్, కోశాధికారిగా చింతకింది శేఖర్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా సమ్మెట రవి, సంయుక్త కార్యదర్శిగా బుర్కు ముత్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కోమటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా జడ్డు ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బీర్కుల నర్సయ్య, సాకలి రాజేందర్, కోశాధికారిగా మహిపాల్, మొగ్గం సామెల్, ఎస్టీ సేల్ అధ్యక్షులుగా భీమన్న, ఉపాధ్యక్షులు సంతోష్, వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా ప్రేమ్‌సింగ్, సంయుక్త కార్యదర్శిగా బొర్రన్నలను ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షులు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా గుండం శ్రీనివాస్, సిర్ర లింగన్న, పల్లె శ్రీనివాస్, హైమత్, అట్లా శ్రీనివాస్‌రెడ్డి, గొల్లరమేష్, మేదరి భోజన్నలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, అట్లా రవీందర్‌రెడ్డి, అట్లా చిన్నరామ్‌రెడ్డి, నారాయణ, వినేష్, నాగేష్, సురేష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

● ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్

ఖానాపూర్, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని బాధన్‌కుర్తిలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ చెక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బులను తీసుకెళ్లేటప్పుడు ఖచ్చితంగా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట స్థానిక ఆర్ఐ రాజేశ్వర్, తదితరులున్నారు.



బాధన్‌కుర్తి ఎస్‌ఎస్‌టీ చెక్ పాయింట్ వద్ద కారును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శివరాజ్

మూగ జీవాల దాహార్తి తీరేదెలా?



గత ప్రభుత్వ హయాంలో కుభీర్ మండలం రాజురా గ్రామంలోనాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన నీటి తొట్టి శిథిలావస్థకు చేరిన దృశ్యం

కుభీర్, మార్చి 19 : వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు మండలంలోని 42 గ్రామాల్లో గత నాలుగు సంవత్సరాల క్రితం పశువుల నీటితొట్టెలను నిర్మించారు. కాగా వాటి నిర్వాహణ సంవత్సరం పాటు చక్కగా కొనసాగింది. ఇప్పుడు చూస్తే దాదాపు 30నీటి తొట్టె పగుళ్ల తేలి నిరునిలవడం లేదు. మూగ జీవాలకు మేతతో పాటు తాగునీరు ఎంతో ముఖ్యం. కుంటలు, చెరువులు, వాగులు ఎండి పోవడంతో పశువులకు నీటి సమస్య తీవ్రంగా ఉంది. గతంలో నీటి కోసం ప్రతి పంచాయతీ గ్రామంలో నిర్మించిన నీటి తొట్టె నిర్వాహణలోపం కారణంగా అవి శిథిలావస్థలోకి చేరాయి. అధికారులు స్పందించి నీటి తొట్టెలను బాగు చేసి వాటిలో నీటిని పంపేలా చర్యలు తీసుకోవాలని పశువుల కాపరులు, ప్రజల కోరుతున్నారు.

పలు మండలాల్లో అకాల వర్షంతో మిర్చిపంటకు నష్టం




బెజ్జూరులో నేలకొరిగిన చెట్టు



కౌటాలలో తడిసి ముద్దయిన మిర్చీ పంట

బెజ్జూరు/కౌటాల/చింతలమానేపల్లి, మార్చి 19: మండలంలో మంగళవారం వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండ తీవ్రత ఉన్న క్రమంలో ఒక్కసారిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజ లకు ఊరట కలిగించింది. గాలితో కూడిన వర్షం కురవడంతో గోల్కొండ-హేటిగూడ గ్రామాల మధ్యచెట్టు విరిగిపడడంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. కాగా పలుగ్రామాల్లో రైతులుమిర్చీ ఆరబెట్ట డంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి.





రేపు ముట్టడి

- నకిలీ డి-1, డీమార్ట్ స్థలంపై యాక్షన్‌కు గడువు
- చర్చనీయాంశమవుతున్న మహేశ్వర్ రెడ్డి హెచ్చరికల వ్యవహారం
- రేపు కలెక్టరేట్ ముట్టడికి బీజేఎల్పీ నేత సన్నాహాలు
- చర్యలు తీసుకుంటే ఆందోళన విరమణకు అవకాశం
- ఉత్కంఠగా మారుతున్న నకిలీల అక్రమ వ్యవహారం



జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం (ఫైల్)

నిర్మల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేల కోట్ల రూపాయల విలువైన సర్కారు భూముల అక్రమ వ్యవహారంపై చర్యలు తీసుకునేందుకు బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి విధించిన గడువు నేటితో ముగిసిపోతోంది. గత కొద్ది రోజుల నుంచి అధికారులు నకిలీ డి-1 పట్టాలు వాటికి సంబంధించిన సేత్వారీలతో పాటు డీమార్ట్ కోసం కొనుగోలు చేసిన భూముల వ్యవహారంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి, విజిలెన్స్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు దాదాపు 350 పైగా డి-1 పట్టాలను సృష్టించి 2వేల ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అప్పటి అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వారి బంధువులంతా కాజేశారంటూ మహేశ్వర్‌రెడ్డి ఆధా రాలతో సహా ఫిర్యాదులు చేశారు. అయితే చాలా రోజుల నుంచి మహేశ్వర్‌రెడ్డి ఈ అంశంపై ఫిర్యాదులు చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయన ఎట్టకేలకు డెడ్‌లైన్ విధించారు. ఎమ్మెల్యేగా గెలు పొందగానే ఆయన మొట్టమొదటగా డి-1 పట్టాల అక్రమాల వ్యవహారం, సోఫీనగర్‌లో డీమార్ట్ నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూముల వ్యవహారంపై గళమెత్తి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అలాగే ఆ పార్టీకి చెందిన నేతలపై విమర్శలు గుప్పించారు. దీనికి తోడుగా ఆయన విజిలెన్స్‌కు ఫిర్యాదు కూడా చేశారు. అలాగే కలెక్టర్‌తో ఈ అంశంపై సీరియస్‌గా చర్చించారు. దీని కారణంగా జిల్లా కలెక్టర్ డి-1 పట్టాల అక్రమాలు, డీమార్ట్ కోసం కొనుగోలు చేసిన భూములపై సీరియస్‌గా విచారణకు ఆదేశించారు. గత 15 రోజుల నుంచి సర్వే ల్యాండ్‌రికార్డ్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా అక్రమాలకు సంబంధించి రికార్డులతో సహా నివేదికలు రూపొందించారు. 2014 నుంచి 2018 సంవత్సరం వరకు గత అప్పటి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు వారి బంధువులు పథకం ప్రకారం సంబంధిత అధికారులతో మిలాఖతై నకిలీ డి-1 పట్టాలు సృష్టించి బోగస్ సేత్వారీలతో ప్రభుత్వ భూములను పెద్ద మొత్తంలో కాజేశారన్న ఫిర్యాదుల మేరకు ఈ విచారణ సాగింది. అక్రమాల గుట్టును రట్టు చేసిన అధికారులు నివేదికలను ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు అందించారు. జిల్లా కలెక్టర్ డి-1 పట్టాలను జారీ చేసే ఎస్సారెస్పీ కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఆ దిశగా విచారణ జరిపించారు. మొదటి నుంచి అక్రమాలపై సీరియస్‌గానే ఉన్న కలెక్టర్ పకడ్బందీగా నివేదికలను తయారు చేయించారు. అయితే ఈ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవాలని లేనట్లయితే తానూ ఈ నెల 20వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తానని, అలాగే ఆమరణ నిరాహార దీక్షను చేపడతానంటూ మహేశ్వర్ రెడ్డి మీడియా ముఖంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో అప్రమత్తమైన యంత్రాంగం ఆగమేఘాల మీద నివేదికలను రూపొందించి కలెక్టర్‌కు అందజేసింది. ఈ నివేదికలపై లోతుగా శోధిస్తున్న కలెక్టర్ చర్యలు తీసుకునేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తున్నారంటున్నారు. ఇదిలా ఉండగా శాసనసభా పక్ష నేత ఏలేటీ మహేశ్వర్ రెడ్డి విధించిన గడువు నేటితో ముగియబోతున్నందున గురువారం ఆయన తన ఆందోళనకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంటోంది.

డి-1 పట్టాల అక్రమాలపై నివేదికలు పూర్తి

2014 నుంచి 2018 సంవత్సరం వరకు భారీ ఎత్తున జరిగిన డి-1 పట్టాల అక్రమాలు, సేత్వారీలకు సంబంధించి అధికారులు లోతుగా విచారణ జరిపారు. అప్పటి అధికారుల ఫోర్జరీల సంతకాలతో ఈ పట్టాలు, సేత్వారీలు సృష్టించారన్న ఆరోపణలు అధికారుల విచారణలో నిర్ధారణ అయినట్లు చెబుతున్నారు. ఎప్పుడో ముగిసిపోయిన డి-1 పట్టాల జారీ ప్రక్రియను అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, వారి బంధువులతో పాటు పార్టీలో వివిధ పదవులను అనుభవిస్తున్న నాయకులు సంబంధితశాఖ అధికారులతో కలిసి ఈ దందాను కొన సాగించారంటున్నారు. దాదాపు నాలుగైదు సంవత్సరాల పాటు రెండువేల ఎకరాలకు పైగా సర్కారు భూములను ఈ డి-1 పట్టాల పేరిట స్వాహా చేశారన్న వాదనలున్నాయి. కొంతమంది దళారులు నకిలీ డి-1 పట్టాలను సృష్టించడం, వాటికి నకిలీ సేత్వారీలు తయారు చేసి సర్కారు భూములను కొట్టేయడం పనిగా పెట్టుకున్నారంటున్నారు. ఈ క్రమంలోనే బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేయడం, అధికారులు విచారణ జరిపి నివేదికలు రూపొందించడం పూర్తయ్యాయి. ఈ నివేదికల ఆధారంగా గురువారం వరకు కలెక్టర్ చర్యలు తీసుకోనట్లయితే మరుసటి రోజు బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నారు.



డీమార్ట్‌పైనా ఫిర్యాదుల వెల్లువ..

కాగా సోఫీనగర్‌లోని డీమార్ట్‌కు సంబంధించిన స్థలం కొనుగోలు వ్యవహారం కూడా వివాదాస్పదంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయడమే కాకుండా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలు, వారి బంధువులు ఈ భూమిని అక్రమంగా డీమార్ట్‌కు అమ్మారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి స్వయంగా డీమార్ట్ స్థలం కొనుగోలుపై గళమెత్తి విచారణ కోసం డిమాండ్ చేశారు. దీనిపై ఒత్తిడి మరింత పెరగడంతో సంబంధిత అధికారులు, సర్వేయర్‌లు కలిసి నివేదికలు రూపొందించారు. రికార్డులను తారుమారు చేశారంటూ కూడా ఫిర్యాదులున్నాయి. అయితే సంబంధిత అధికారులు రూపొందించిన నివేదికలను ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు అందించారు. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై సీరియస్‌గానే ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది దళారులు మాత్రం కలెక్టర్‌పై మరోసారి ఒత్తిడి తెప్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారంటున్నారు.

నేటితో ముగియనున్న గడువు.. సర్వత్రా ఉత్కంఠ..

కాగా మహేశ్వర్‌రెడ్డి డి-1 పట్టాల అక్రమాలు, డీమార్ట్ భూమి కొనుగోలు వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ చర్యలకు గడువు విధించారు. ఆయన విధించిన గడువు బుధవారం రాత్రితో ముగిసిపోనుంది. అయితే మహేశ్వర్‌రెడ్డి దీనికి వ్యతిరేఖంగా పెద్దఎత్తున ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆయన హైదరాబాద్ నుంచి ఫోన్‌లలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు తన అనుచరులు, అభిమానులతో మంతనాలు జరుపుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. బుధవారం సాయంత్రం లోగా అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించనట్లయితే మహేశ్వర్‌రెడ్డి గురువారం ఉదయం కలెక్టరేట్ ముట్టడితో పాటు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టబోతున్నట్లు బీజేపీ శ్రేణులు వెల్లడిస్తున్నాయి.

కన్నుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- భారీగా హాజరవుతున్న భక్త జనం



ఉత్సవమూర్తితో ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు

భైంసా, మార్చి 19 :పట్టణంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి. సోమవారం స్థానిక మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభమైన వేడుకలు శనివారం వరకు కొనసాగనున్నాయి. వేడుకలలో భాగంగా మంగళవారం ఉదయం వేళల్లో ఆలయ అవరణలో యాగాన్ని నిర్వహించారు. ఉదయం వేళలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, చతుస్థానార్చన, మూల మంత్రహవనములు, గరుడ హోమం, ధ్వజారోహణము, సంతనార్థులకు గరుడ ప్రసాద కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. మధ్యాహ్నం వేళలో ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాంగణంలో శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం వేళలో శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, నిత్య హవనములు, భేరిపూజ, దేవతాహావనములు, నిత్యహవనం, భేరిపూజ, దేవతాహ్వానం, నివేదన కార్యక్రమాలు జరిగాయి. వేడుకలకు పట్టణంలోని వివిధ కాలనీల భక్తులే కాకుండా సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కళశ స్థాపన మహోత్సవానికి మహిళాభక్తులు అధిక సంఖ్యలో హజరయ్యారు. వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో రాత్రి వేళల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరారించాయి.

గుండంపల్లిలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



గుండంపల్లిలో హోమం నిర్వహిస్తున్న గ్రామస్థులు

దిలావర్‌పూర్, మార్చి 19 : మండలంలోని గుండంపల్లిలో శ్రీ శివ పంచాయత పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిషాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. ఉదయం పుణ్యాహవాచనం, స్థాపిత దేవతా పూజలు, ప్రతిష్ఠవిగ్రహాల మూల మంత్ర హోమం, స్థాపిత దేవతా హవనం, సూక్త హోమం, సాయంత్రం స్థాపిత దేవత పూజలు, ప్రతిష్ఠాంగ హోమాలు, ధాన్యాదివాసం, ఫలపుష్పాదివాసం, మహిళలచే సామూహిక కుంకుమార్చన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ, శయ్యాదివాసం హారతి, మంత్రపుష్పం, తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



వైద్య ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

పది పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

నిర్మల్ కల్చరల్, మార్చి 19 : నిర్మల్‌లోని జుమ్మేరాత్‌పేట్ ఉన్నత పాఠశాలలోని పది పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కాపీ జరుగకుండా చూడాలని, విద్యార్థును క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే కేంద్రంలోని అనుమతించాలని పలు సూచనలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కుంటాల శ్రీ కృష్ణ దేవాలయంలో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు


కుంటాల, మార్చి, 19 : మండల కేంద్రం కుంటాల స్థానిక ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయం అష్టమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అభిషేకం, హారతి, శ్రీ లక్ష్మీ అష్టోత్తరశతనామ స్తోత్రము, విష్ణు సహస్రనామము, భగవద్గీత పారాయణం, యజ్ఞం తదితర కార్యకరమాల నిర్వహించారు. అనంతరం ఎంపీపీ అప్క గజ్జారాం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నంది విగ్రహ ప్రతిష్ఠాపన

నర్సాపూర్(జి), మార్చి 19 : మండలంలోని డొంగుర్‌గాం సిద్దేశ్వరాలయంలో రెండు రోజుల నుంచి వేద పండితులు కైలాస్ ఆధ్వర్యంలో పూజలు, యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. నేడు దత్తాత్రేయ, నవగ్రహ ధ్వజస్తంబ నంది విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి

- ఖానాపూర్ సీఐ సైదారావు



ఖానాపూర్, మార్చి 19 : సమాజంలో జరుగుతున్న మోసాల పట్ల ఆడపిల్లలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మజ్యోతి బాపూలే పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలు ఆడపిల్లలపై అఘాయిత్యాల గురించి అవగాహన కల్పించిన సీఐ సైదారావు అనుకోని ఆపదలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎస్సై లింబాద్రి, షీ టీం ఎస్సై సుమలత, తదితరులున్నారు.

గ్రేహౌండ్స్ శిక్షణతో సమర్ధవంతమైన సేవలు

ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, మార్చి 19 : గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందడంతో పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఉపయోగపడుతోందని ఎస్పీ జానకిషర్మిల అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వారం రోజులపాటు పోలీసు సిబ్బందికి గ్రే హౌండ్స్‌లో శిక్షణ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎస్పీ మాట్లాడుతూ... పోలీసులకు పలు సూచనలు చేశారు. పోలీసుల దేహ దారుఢ్యం పెంచడంతో పాటు మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టవచ్చునన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు సిబ్బంది నిర్వహించాల్సిన మెళకువలు, బాధ్యతలు నేర్చుకోవడానికి వీలుంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించడం, వాహనాల తనిఖీ తదితర పనులను సజావుగా జరిగేందుకు శిక్షణ ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ రామ్ నిరంజన్, శైలేందర్, రామకృష్ణ, ఆర్ఎస్సైలు వినోద్, సాయికృష్ణ, రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

పన్నుల వసూళ్లపై కొరడా ఝుళిపిస్తున్న మున్సిపల్ అధికారులు



ఆస్తులను జప్తు చేస్తున్న మున్సిపల్ అధికారులు

నిర్మల్ టౌన్, మార్చి 19 : జిల్లాకేంద్రంలో కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక టీంగా ఏర్పడి కొరడా ఝుళిపిస్తున్నారు. పెద్దమొత్తంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని యజమానులకు ఇదివరకే నోటీసులను పంపారు. అధికారులు నోటీసులకు స్పందించని యజమానులపై చర్యలు మున్సిపల్ సిబ్బంది తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా మున్సిపాలిటీ ఆదాయంతోనే అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది 8 బృందాలుగా ఏర్పడి వసూళ్లను ముమ్మరం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు వార్డుల వారీగా తిరుగుతూ మున్సిపల్ ట్యాక్స్ చెల్లించని వారిని కలుస్తూ టాక్స్ కట్టాలని కోరుతున్నారు. అయినా వినని లబ్ధిదారుల సామాగ్రిని జప్తు చేసేందుకు సైతం మున్సిపల్ అధికారులు వెనుకాడడం లేదు. పోలీసుల సెక్యూరిటీని తీసుకొని మొండి బకాయిలను సైతం వసూలు చేసేందుకు వెనుకాడడం లేదు. దీంట్లో భాగంగానే జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినగర్, గాజులపేట్ తదితర ప్రాంతాల్లో సకాలంలో పన్నులు చెల్లించని సదరు యజమాని ఆస్తులను జప్తు చేశారు. ఇంటికి ఉన్న గేట్లతో పాటు వారి సామాగ్రిని తీసుకువచ్చి మున్సిపల్ కార్యాలయంలో భద్రపరుస్తున్నారు. పన్ను చెల్లించి వాటిని తీసుకెళ్లాలని ఇంటి యజమానులకు సూచిస్తున్నారు. పన్ను వసూళ్లపై 90 శాతం వడ్డీ మాఫీ చేసిందని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకొని మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో పల్లెల అభివృద్ధి

డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 19 : ప్రభుత్వ సహకారంతో పల్లెలను అభివృద్ధి చేస్తానని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మంగళవారం సోన్ మండలం సిద్ధిలకుంట గ్రామం గురుడిరెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ. 5 లక్షల రూపాయలు, మాదిగ సంఘం భవనానికి 5 లక్షల రూపాయలు, విశ్వబ్రాహ్మణ సంఘం భవనానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘ సభ్యులు జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంఘ భవనానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు శ్రీహరి రావును శాలువాతో సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి

నిర్మల్ రూరల్ : నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మంగళవారం సోన్ మండలం పాక్‌పట్ల గ్రామం రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ. 10 లక్షల రూపాయలు, మాదిగ సంఘం భవనానికి 5 లక్షల రూపాయలు, ఒడ్డెర సంఘం భవనానికి 5 లక్షల రూపాయలు, కుమ్మరి సంఘం భవనానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘ సభ్యులు జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సంఘ భవానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు శ్రీహరిరావును శాలువాతో సత్కరించారు.



శ్రీహరిరావును సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం

కుంటాల, మార్చి, 19: మండలంలోని విట్టాపూర్ గ్రామంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్టి కార్యక్రమంలో గర్బిణీలు, బాలింతలు, విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, సిబ్బంది సురేఖ, శ్యామల, గర్బిణీలు, బాలింతలు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

22న ఇసుక వేలం పాట

నర్సాపూర్(జి), మార్చి 19 : మండలంలోని అర్లి(కె) గ్రామంలో ఈనెల 12న అక్రమంగా నిల్వ ఉంచిన 70 ట్రాక్టర్ల ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈనెల 22న శుక్రవారం మండలంలోని అర్లి(కె) గ్రామంలో పట్టుకున్న ఇసుక వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఇసుక వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఇరవై ఎనిమిది వేల డీడీతో ఇసుక వేలం పాటలో పాల్గొని ఎక్కువగా ఎవరైతే వేలం పాట ద్వారా పొందుతారో వారు ఇసుకను స్వాధీన పర్చుకోవాలని తెలిపారు.

వలలో చిక్కి మత్స్యకారుడు మృతి



మృతి చెందిన చేపల జాలరుడు రాజన్న

మామడ, మార్చి 19 : మండలంలోని పొన్కల్ గ్రామంలో గల వెంగన్న చెరువులో చెరుకు రాజన్న (55) అనే వ్యక్తి గ్రామంలోని కుల సభ్యులతో కలిసి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మత్స్యకారుడు మృతి చెందాడని స్థానికులు, మామడ ఎస్సై సందీప్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పల్లెల్లో జాజిరి.. జాజిరి



జాజిరి ఆడుతున్న చిన్నారులు

ముథోల్, మార్చి 19 : పండుగ ఏదైనా పల్లెల్లో ఎంతో ప్రత్యేకంగా జరుపుకుంటారు. పిల్లల నుంచి పెద్దల వరకు తమదైన సందడితో ఆ పండుగకు మరింత వన్నె తెస్తారు. అసలే పల్లె పదాలతో సాహిత్య పరిమళాలు కొత్త గుబాళింపు వెదజల్లే పల్లెల్లో ఆ సందడి మరింత ఆసక్తికరంగా ఉంటుంది. రంగుల పండుగ హోలీ కంటే పదిరోజుల ముందు నుంచే గ్రామాల్లో చిన్నారుల జాజిరి పాటలు పల్లెల్లో ప్రత్యేకం. కాముని పున్నమిని పురస్కరించుకొని పది రోజుల పాటు గ్రామాల్లో జాజిరి ఆడటం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం. చిన్నారులు, యువకులు ప్రతి ఇంటికి వెళ్లి కోలాలు చేతబూని జాజిరి... జాజిరి... జాజిరన్న... కట్టపొంటి... కట్టపొంటి ఒకటే నక్క, నక్కకు నాలుగు కాళ్లు అందుకోయే చుక్క అంటూ జాన పదాలు పాడుతుంటే ప్రతి ఇంటివారు వారికి ధాన్యం కానుకగా ఇస్తారు. పిల్లలు జాజిరి ఆడిన కోలాలను కామ దహనం రోజు కామ దహనంలో వేస్తారు. తెలంగాణ ప్రాంతంలో హోలీ పండుగ సందర్భంగా ఈ జాజిరి ఆట సంస్కృతి సాంప్రదాయాలకు బద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పుకోవచ్చు.